జ్వాల
# దశ
నిజం.. నిర్భయంగా..

WWW.DASHANEWS.COM
బుధవారం 09-09-2026
సంపుటి 1 సంచిక 288
పేజీలు : 04
వెల : 1/-
PRGI No : TGTEL/25/A4195

విలేకరులు కావలెను
నిత్య నూతన ఒరవడితో నిజాలను నిర్భయంగా అందిస్తూ, ప్రత్యేకంగా వార్తా కథనాలను ఎప్పటికప్పుడు ప్రచురిస్తున్న దశ పత్రికలో భాగమయ్యేందుకు తెలంగాణ రాష్ట్రంలోని ఆసక్తిగల అభ్యర్థులను ఆహ్వానిస్తున్నాము.
జిల్లా స్టాఫ్ రిపోర్టర్స్ | ఆర్.సీ.ఇన్చార్జులు
మండల రిపోర్టర్స్ | క్రైమ్ రిపోర్టర్లు
7337546647
(మీ వివరాలను వాట్సప్‌లో పంపగలరు)

# రేవంత్‌రెడ్డి కలియుగ దుశ్శాసనుడు


## సబితా ఇంద్రారెడ్డి గొంతు పిసికి.. సునీతా లక్ష్మారెడ్డి చీర లాగారు

### ఇది గౌరవ సభ కాదు.. కౌరవ సభ.. మాజీ మంత్రి హరీశ్‌రావు తీవ్ర ఆరోపణలు



**దశ, హైదరాబాద్:** మహిళా ఎమ్మెల్యేలపై అసెంబ్లీ పరిసరాల్లో దాడులు జరిగాయని, అయినా బాధితులపైనే పోలీసులు కేసులు నమోదు చేశారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆరోపించారు. సబితా ఇంద్రారెడ్డి గొంతు పిసికారని, సునీతా లక్ష్మారెడ్డి చీర లాగారని పేర్కొంటూ.. యావత్ మహిళా లోకాన్ని అవమానించారని విమర్శించారు. ప్రస్తుత అసెంబ్లీ గౌరవ సభగా కాకుండా 'కౌరవ సభ'గా మారిందని, సీఎం రేవంత్‌రెడ్డి కలియుగ దుశ్శాసనుడిలా వ్యవహరిస్తున్నారని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. మహిళా ఎమ్మెల్యేలపై జరిగిన దాడిని పోలీసులు పరిశీలిస్తారని మంత్రి శ్రీధర్‌బాబు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. సబితా ఇంద్రారెడ్డిపై పురుష పోలీసులు దాడి చేసి గొంతు పిసికిన దృశ్యాలు వీడియోల్లో స్పష్టంగా కనిపిస్తున్నాయని, మరో మాజీ మంత్రి, ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి చీర లాగడంతో కన్నీరు పెట్టుకున్న దృశ్యాలను ప్రజలంతా చూశారని అన్నారు. ఇంత జరిగినా ఇప్పటివరకు సమగ్ర విచారణ జరగలేదని విమర్శించారు. సీపీకి, పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినప్పటికీ న్యాయం చేయకుండా దాడికి గురైన సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి, కోవా లక్ష్మిపై తిరిగి కేసులు నమోదు చేశారని హరీశ్‌రావు ఆరోపించారు. పోలీసుల తీరు 'ఉల్టా చోర్ కొత్వాల్ కో డాంటే' అన్నట్లుగా ఉందన్నారు. ఇది బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలపై జరిగిన దాడి మాత్రమే కాదని, రాష్ట్రంలోని మహిళా లోకంపై జరిగిన దాడిగా అభివర్ణించారు. స్పీకర్ పట్ల తమకు పూర్తి గౌరవం ఉందని హరీశ్‌రావు తెలిపారు. తాతా మధు తన వ్యాఖ్యలపై వివరణ ఇచ్చి, అవసరమైతే ఆ పదాలను ఉపసంహరించుకుంటున్నానని, విచారం వ్యక్తం చేస్తున్నానని లిఖితపూర్వకంగా క్షమాపణ చెప్పినా అరెస్టు చేసి జైలుకు పంపారని అన్నారు. ఒకే తప్పుకు ఎన్ని శిక్షలు వేస్తారో స్పీకర్ విజ్ఞతకే వదిలేస్తున్నామని పేర్కొన్నారు. దళితులు, గిరిజనులపై కాంగ్రెస్‌కు నిజంగా ప్రేమ ఉంటే ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్‌ను ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. 125 అడుగుల

..మిగతా 4వ పేజీలో →



# హరీశ్‌కు మైక్ ఇస్తే సారీ చెబుతారని భావించా..

## డైవర్షన్ చేయడంతో కోపం వచ్చింది

### మహిళా ఎమ్మెల్యేల ఘటనపై నివేదిక తెప్పించి చర్యలు: స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

**దశ, హైదరాబాద్:** అసెంబ్లీలో సోమవారం జరిగిన ఘటనపై సభలో క్షమాపణలు చెబుతారని భావించానని శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ తెలిపారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. హరీశ్‌రావుకు మైక్ ఇస్తే క్షమాపణ చెబుతారని అనుకున్నానని, అయితే ఆయన అంశాన్ని పక్కదారి పట్టించే ప్రయత్నం చేశారని అన్నారు. ప్రజాస్వామ్యబద్ధంగా సభను నడపాలన్నదే తన ఆలోచన అని స్పష్టం చేశారు. కడియం శ్రీహరిని ప్యానెల్ స్పీకర్‌గా నియమిస్తున్నట్లు తెలిపారు. గతంలో సబితా ఇంద్రారెడ్డితో రాజకీయంగా విభేదాలు ఉన్నప్పటికీ, సభలో ఈ తరహా పరిస్థితులు ఎప్పుడూ చోటుచేసుకోలేదన్నారు. హరీశ్‌రావు

..మిగతా 4వ పేజీలో →



# 66 కిలోల బంగారంతో గణనాథుడు

### 335 కిలోల వెండి ఆభరణాలతో మహాగణపతి అలంకారం

### రూ.703.27 కోట్ల బీమా రక్షణ

### రోజూ 40 వేల మందికి అన్నదానం

**దశ, ముంబై :** విఘ్నాలను తొలగించే విఘ్నేశ్వరుడి ఉత్సవాలకు ముంబై నగరం సిద్ధమవుతోంది. దేశవ్యాప్తంగా గణేశ్ ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నప్పటికీ.. ముంబైలోని కింగ్స్ సర్కిల్ జీఎస్‌బీ సేవా మండల్ మహాగణపతి ఉత్సవానికి ప్రత్యేక గుర్తింపు ఉంది. భక్తి, సంప్రదాయం, సేవ, వైభవం కలగలిసిన ఈ ఉత్సవాలను ఈ ఏడాది మరింత ఘనంగా నిర్వహించేందుకు మండల్ ఏర్పాట్లు పూర్తి చేసింది. 72వ గణేశోత్సవంలో మహాగణపతికి ఏకంగా రూ.703.27 కోట్ల

..మిగతా 4వ పేజీలో →



4లో

# 25 రోజులకే గ్యాస్ సిలిండర్

### గ్రామీణ ప్రాంతాల్లో బుకింగ్ గడువు 45 నుంచి 25 రోజులకు తగ్గింపు

### తక్షణమే అమల్లోకి కొత్త నిబంధనలు



# వారెంట్ ఉండగా విదేశాలకు ఎలా వెళ్తారు?

4లో

### ఐఏఎస్ అధికారులపై హైకోర్టు ఆగ్రహం

### పరిహారం చెల్లింపు జాప్యంపై అసహనం

దశ, హైదరాబాద్: బెయిలబుల్ వారెంట్ ఉన్న ఐఏఎస్ అధికారులు విదేశాలకు వెళ్లి ఎలా తిరిగి వస్తారని తెలంగాణ హైకోర్టు ప్రశ్నించింది. ఎయిర్‌పోర్టులో అరెస్ట్ అయితే పరిస్థితి ఏంటని నిలదీసింది. భూసేకరణ బాధితులకు పూర్తి పరిహారం చెల్లించాలని ఆదేశించినా అమలు చేయకపోవడంపై కోర్టు ధిక్కరణ పిటిషన్ విచారణలో ఈ వ్యాఖ్యలు చేసింది. ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి

..మిగతా 4వ పేజీలో →



## వేములవాడలో

# భక్తజన సంద్రం

### బద్ది పోచమ్మకు ఘనంగా బోనాలు.. 1.18 లక్షల మంది భీమేశ్వరుడి దర్శనం

### మహిళా భక్తులతో కిటకిటలాడిన ఆలయ ప్రాంగణం

**దశ, వేములవాడ:** రాజన్న సిరిసిల్ల జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో భక్తుల రద్దీ విపరీతంగా పెరిగింది. సోమవారం నుంచి ఇప్పటివరకు దాదాపు 1,18,776 మంది భక్తులు శ్రీ భీమేశ్వర స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. అనుబంధ ఆలయమైన శ్రీ బద్ది పోచమ్మ సన్నిధి మహిళా భక్తులతో కిటకిటలాడింది. సోమవారం ఉదయం ప్రారంభమైన రద్దీ అర్ధరాత్రి వరకు కొనసాగింది. పెద్ద సంఖ్యలో తరలివచ్చిన మహిళా భక్తులు బద్ది పోచమ్మ అమ్మవారికి బోనాలు, ఒడిబియ్యం, చీరసారె, బెల్లం, సాక, పట్నాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. బద్ది పోచమ్మను లక్ష మందికి పైగా భక్తులు దర్శించుకునే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ ఈవో రమాదేవి ఆదేశాల మేరకు డిప్యూటీ ఈవో ప్రతాప్ నవీన్‌కుమార్ క్షేత్రస్థాయిలో

..మిగతా 4వ పేజీలో →

# రేవంత్.. కొడంగల్‌లో రాజీనామా చేయండి..

### హుజూరాబాద్‌లో నేను చేస్తా!

### సీఎం రేవంత్‌రెడ్డికి బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి సవాల్.

### పార్టీ మారిన ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించి ఉప ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్.

**దశ, హైదరాబాద్:** కొడంగల్‌లో ఎమ్మెల్యేగా సీఎం రేవంత్‌రెడ్డి రాజీనామా చేస్తే.. హుజూరాబాద్‌లో తాను ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి సవాల్ విసిరారు. మంగళవారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడారు. హుజూరాబాద్‌లో కాంగ్రెస్‌కు డిపాజిట్ వచ్చినా, కొడంగల్‌లో

..మిగతా 4వ పేజీలో →




# హైదరాబాద్‌లో IREC 2026

### ఈనెల 25-27 వరకు అంతర్జాతీయ రియల్ ఎస్టేట్ సదస్సు

### 35కుపైగా దేశాల నుంచి 1,500 మందికి పైగా ప్రతినిధులు

దశ, హైదరాబాద్: భారత్ తొలిసారిగా అంతర్జాతీయ రియల్ ఎస్టేట్ సదస్సుకు ఆతిథ్యం ఇవ్వనుంది. IREC 2026 ఏడో ఎడిషన్ సెప్టెంబర్ 25 నుంచి 27 వరకు హైదరాబాద్‌లోని హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో జరగనుంది. 35కుపైగా దేశాల నుంచి 1,500 మందికి పైగా డెవలపర్లు, పెట్టుబడిదారులు,

..మిగతా 4వ పేజీలో →

# దళితుల అవమానాన్ని తెలంగాణ సమాజం సహించదు



### కేసీఆర్ బేషరతుగా క్షమాపణ చెప్పాలి

### ఎర్రవల్లి ఫామ్‌హౌస్ ముట్టడించిన కాంగ్రెస్ దళిత విభాగం

### బీఆర్ఎస్‌పై రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలకు హెచ్చరిక

దశ, మెదక్ : శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు చేసినట్లు పేర్కొంటున్న అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ కాంగ్రెస్ దళిత విభాగం నాయకులు ఎర్రవల్లిలో మాజీ సీఎం కేసీఆర్ ఫామ్‌హౌస్‌ను ముట్టడించారు. తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఎస్సీ విభాగం చైర్మన్, మానకొండూర్ ఎమ్మెల్యే కవంపల్లి సత్యనారాయణ ఆదేశాల మేరకు

..మిగతా 4వ పేజీలో →

# శుభకార్యాల ఇళ్ల వద్ద బలవంతపు వసూళ్లపై పోలీసుల కొరడా

### రూ.50 వేల డిమాండ్ ఘటనతో డీజీపీ ఆగ్రహం

### రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక డ్రైవ్‌కు ఆదేశాలు

**దశ, హైదరాబాద్,** సెప్టెంబరు 8: శుభకార్యాలు జరిగే ఇళ్లను లక్ష్యంగా చేసుకుని కొందరు ట్రాన్స్‌జెండర్ల పేరుతో సాగిస్తున్న బలవంతపు వసూళ్లు, బెదిరింపులకు తెలంగాణ పోలీస్ శాఖ చెక్ పెట్టేందుకు సిద్ధమైంది. అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న వారిపై రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక పోలీస్ డ్రైవ్ నిర్వహించాలని డీజీపీ సీవీ ఆనంద్ పోలీస్ కమిషనర్లు, ఎస్పీలను ఆదేశించినట్లు సమాచారం. ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తూ డబ్బులు వసూలు చేస్తే ఇకపై ఉపేక్షించేది లేదని పోలీస్ శాఖ స్పష్టం చేసింది. సెప్టెంబరు 4న చింతల్‌లో కొత్త ఇంట్లోకి ప్రవేశిస్తున్న ఓ కుటుంబాన్ని కొందరు ట్రాన్స్‌జెండర్లు అడ్డుకుని రూ.50 వేల నగదు డిమాండ్ చేసిన ఘటన తీవ్ర కలకలం రేపింది. అంత పెద్ద మొత్తం

..మిగతా 4వ పేజీలో →

# 25 రోజులకే గ్యాస్ సిలిండర్

## గ్రామీణ ప్రాంతాల్లో బుకింగ్ గడువు 45 నుంచి 25 రోజులకు తగ్గింపు

## తక్షణమే అమల్లోకి కొత్త నిబంధనలు

**దశ, హైదరాబాద్:** వంటగ్యాస్ వినియోగదారులకు కేంద్ర ప్రభుత్వం ఊరటనిచ్చే నిర్ణయం తీసుకుంది. గ్రామీణ ప్రాంతాల్లో ఎల్‌పీజీ రీఫిల్ సిలిండర్ బుకింగ్‌కు ఉన్న 45 రోజుల గడువును 25 రోజులకు తగ్గిస్తున్నట్లు కేంద్ర మంత్రి సురేశ్ గోపీ వెల్లడించారు. దీంతో గ్రామీణ ప్రాంతాల వినియోగదారులు ఇకపై పట్టణ ప్రాంతాల మాదిరిగానే 25 రోజులకు ఒకసారి సిలిండర్ బుక్ చేసుకునే అవకాశం కలగనుంది. మిడిల్ ఈస్ట్‌లో నెలకొన్న ఉద్రిక్తతల నేపథ్యంలో ఎల్‌పీజీ సరఫరాపై ఒత్తిడి పెరగడంతో గతంలో కేంద్రం బుకింగ్ నిబంధనలను మార్చింది. పట్టణ ప్రాంతాల్లో 25 రోజులు, గ్రామీణ ప్రాంతాల్లో 45 రోజులుగా రీఫిల్ బుకింగ్ మధ్య వ్యవధిని నిర్ణయించింది. అయితే ప్రస్తుతం ఎల్‌పీజీ సరఫరా పరిస్థితులు మెరుగుపడటంతో పాటు పెండింగ్ రీఫిల్ బుకింగ్‌ల బ్యాక్‌లాగ్ గణనీయంగా తగ్గిన నేపథ్యంలో గ్రామీణ ప్రాంతాల్లోనూ గడువును 25 రోజులకు కుదించింది. ఈ మార్పులు దేశవ్యాప్తంగా తక్షణమే అమల్లోకి వస్తాయని కేంద్రం స్పష్టం చేసింది. ఈ మేరకు పెట్రోలియం, సహజవాయువు మంత్రిత్వ శాఖ ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, భారత్ పెట్రోలియం కార్పొరేషన్, హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్‌లకు ఆదేశాలు జారీ చేసింది. కేంద్రం తాజా నిర్ణయం గ్రామీణ ప్రాంతాల్లోని ఎల్‌పీజీ వినియోగదారులకు గణనీయమైన ఊరట కల్పించనుంది.

# 66 కిలోల బంగారంతో గణనాథుడు

మొదటి పేజీ తరువాయి

బీమా రక్షణ కల్పించారు. మహాగణపతి విగ్రహాన్ని ఈసారి 66 కిలోలకుపైగా బంగారు ఆభరణాలు, 335 కిలోలకుపైగా వెండి ఆభరణాలతో అలంకరించనున్నారు. వీటికి తోడు విలువైన రత్నాలను కూడా స్వామివారి అలంకరణలో వినియోగించనున్నారు. ఈ ఆభరణాల్లో అధిక భాగం భక్తులు, సేవాదారులు సంవత్సరాలుగా గణనాథుడికి సమర్పించినవే. భక్తుల విశ్వాసానికి ప్రతీకలుగా నిలిచిన ఈ ఆభరణాలు ప్రతి ఏటా మహాగణపతి అలంకరణలో ప్రధాన ఆకర్షణగా నిలుస్తాయి. బంగారం, వెండి ధరలు భారీగా పెరగడంతో ఆభరణాల విలువ కూడా గణనీయంగా పెరిగింది. దీంతో బీమా విలువ గతంతో పోలిస్తే భారీగా పెరిగింది. 2024లో సుమారు రూ.400 కోట్లుగా ఉన్న బీమా విలువ 2025లో రూ.474 కోట్లకు చేరింది. ఇప్పుడు 2026లో ఏకంగా రూ.703.27 కోట్లకు పెరిగింది. బంగారం, వెండి ఆభరణాలతోపాటు ఉత్సవాలకు సంబంధించిన విలువైన వస్తువులు, భక్తుల రాకపోకలు తదితర అంశాలకు కూడా ఈ బీమా రక్షణ వర్తించనుంది. ముంబైలో జీఎస్‌బీ సేవా మండల్ 1951లో ఏర్పాటైంది. 1955లో గణేశోత్సవ వేడుకలను ప్రారంభించింది. అప్పటి నుంచి ప్రతి ఏడాది సంప్రదాయబద్ధంగా మహాగణపతి ఉత్సవాలను నిర్వహిస్తోంది. ఈ ఏడాది మహాగణపతి తొలి ప్రజా దర్శనాన్ని 'విరాట్ దర్శన్' పేరుతో సెప్టెంబరు 12న రాత్రి 8 గంటలకు ప్రారంభించనున్నారు. ప్రధాన ఐదు రోజుల గణేశోత్సవం సెప్టెంబరు 14 నుంచి 18 వరకు కొనసాగనుంది. ఈ సందర్భంగా లక్షలాది మంది భక్తులు మహాగణపతిని దర్శించుకునేందుకు తరలివచ్చే అవకాశం ఉంది.

# రేవంత్‌రెడ్డి కలియుగ దుశ్శాసనుడు

మొదటి పేజీ తరువాయి

అంబేద్కర్ విగ్రహానికి తాళాలు ఎందుకు వేశారని నిలదీశారు. దళితుల గురించి మాట్లాడే అర్హత సీఎం రేవంత్‌రెడ్డికి లేదని హరీశ్‌రావు విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి మహాభారతంలోని కౌరవుల గతే పడుతుందని హెచ్చరించారు. అసెంబ్లీ ముందు సోమవారం చోటుచేసుకున్న గొడవపై పోలీసులు ఐదు కేసులు నమోదు చేశారు. ఈ ఘటనకు సంబంధించి ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్‌రెడ్డిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. అనంతరం వారిని నారాయణగూడ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఆమ్ ఆద్మీ పార్టీ కార్యకర్త హేమచంద్రపై పెట్రోల్ పోసి హంగామా చేసిన ఘటనకు సంబంధించి కూడా పోలీసులు కేసు నమోదు చేశారు. మరోవైపు బీజేపీ కార్యకర్త గణేష్‌పై ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేశారనే ఆరోపణలతో కేసు నమోదు చేసినట్లు తెలిపారు. పోలీస్ అధికారులపై దాడికి పాల్పడి, దూషించారనే ఆరోపణలపై బీఆర్ఎస్ నేతలు హరీశ్‌రావు, కేటీఆర్‌తో పాటు మరికొందరిపై కూడా కేసులు నమోదు చేసినట్లు పోలీసులు వెల్లడించారు. అసెంబ్లీ పరిసరాల్లో చోటుచేసుకున్న పరిణామాలపై దర్యాప్తు కొనసాగుతున్నట్లు తెలిపారు.

# విగ్రహ తరలింపులో విషాదం

## విద్యుదాఘాతంతో డ్రైవర్ మృతి

**దశ, ఘట్‌కేసర్ :** గణేశ్ విగ్రహాన్ని తరలిస్తుండగా విద్యుత్ తీగలు తగిలి డ్రైవర్ భానుప్రసాద్ మృతి చెందాడు. ఘన్‌పూర్ నుంచి అల్వాల్‌కు లేలాండ్ వాహనంలో విగ్రహాన్ని తరలిస్తుండగా 11 కేవీ విద్యుత్ తీగలు విగ్రహానికి తగిలి వాహనానికి విద్యుత్ ప్రసరించినట్లు పోలీసులు తెలిపారు. తీవ్ర గాయాలైన భాను సికింద్రాబాద్‌లోని యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు.

# హరీశ్‌కు మైక్ ఇస్తే సారీ చెబుతారని భావించా

మొదటి పేజీ తరువాయి

పదేళ్లు మంత్రిగా సభలో పనిచేశారని, ఆయన కూడా బాధ్యతగా స్పందించాల్సిన అవసరం ఉందని వ్యాఖ్యానించారు. స్పీకర్ పరిధి కాదని చెప్పడం సరికాదని, పబ్లిక్ గర్డెన్స్ నుంచి తన పరిధి ఉంటుందని ప్రసాద్‌కుమార్ పేర్కొన్నారు. కౌశిక్‌రెడ్డితో పాటు ఇద్దరు ఎమ్మెల్సీలను సస్పెండ్ చేసి పంపే అధికారం ఉన్నప్పటికీ, అలా చేయడం సరైన పద్ధతి కాదని అన్నారు. కేటీఆర్, కౌశిక్‌రెడ్డి పోలీసులు కొడుతున్న దృశ్యాలు వీడియోల్లో కనిపించాయని పేర్కొన్నారు. మహిళా ఎమ్మెల్యేలపై జరిగిన ఘటనపై సీఎం కూడా సీరియస్‌గా ఉన్నారని, దీనిపై నివేదిక తెప్పించి తగిన చర్యలు తీసుకుంటామని స్పీకర్ తెలిపారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వం రూపొందించిన సభా నిబంధనలనే తాము అమలు చేస్తున్నామని చెప్పారు. ప్లకార్డులతో సభకు వచ్చిన రాహుల్‌గాంధీకి అప్పట్లో స్పీకర్ అభ్యంతరం వ్యక్తం చేశారని గుర్తుచేశారు. సభ ప్రారంభానికి ముందు శాసనసభాపక్ష నేతలకు ఫోన్ చేసి మాట్లాడతానని, కేసీఆర్‌కు కూడా ఫోన్ చేసి సభకు రావాలని కోరానని ప్రసాద్‌కుమార్ తెలిపారు. అయితే ఆరోగ్యం సహకరించడం లేదని కేసీఆర్ చెప్పారని వెల్లడించారు. కడియం శ్రీహరిని ప్యానెల్ స్పీకర్‌గా నియమిస్తున్నామని, తాను బుధవారం సభకు దూరంగా ఉంటున్నట్లు తెలిపారు.

# వారెంట్ ఉండగా విదేశాలకు ఎలా వెళ్తారు?

మొదటి పేజీ తరువాయి

సందీప్ సుల్తానియా, ఆర్అండ్‌బీ ముఖ్య కార్యదర్శి వికాస్‌రాజ్‌లకు గతంలో పూర్తి పరిహారం చెల్లించాలని ఆదేశాలు జారీ అయ్యాయి. ఇటీవల పరిహారం చెల్లించామని ప్రభుత్వ న్యాయవాదులు తెలపడంతో కోర్టు ధిక్కరణ కేసును హైకోర్టు ముగించింది.

# దళితుల అవమానాన్ని తెలంగాణ సమాజం సహించదు

మొదటి పేజీ తరువాయి

ఆత్మగౌరవాన్ని అవమానించడమేనని అన్నారు. బీఆర్ఎస్ దళిత వ్యతిరేక వైఖరి మరోసారి బయటపడిందని ఆరోపించారు. ఈ ఘటనపై కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు వెంటనే స్పందించి తెలంగాణ దళిత సమాజానికి బేషరతుగా క్షమాపణ చెప్పాలని మోహన్ డిమాండ్ చేశారు. క్షమాపణ చెప్పకపోతే రాష్ట్రవ్యాప్తంగా బీఆర్ఎస్‌కు వ్యతిరేకంగా మరింత ఉధృతంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. దళితుల ఆత్మగౌరవాన్ని అవమానించిన వారిని తెలంగాణ ప్రజలు క్షమించరని, కేసీఆర్ వెంటనే బేషరతుగా క్షమాపణ చెప్పాలని ఆయన అన్నారు. బీఆర్ఎస్ దళిత వ్యతిరేక రాజకీయాలకు ప్రజలే తగిన బుద్ధి చెబుతారని వ్యాఖ్యానించారు. నిరసనలో వైస్ చైర్మన్ చుక్క శ్రీనివాస్‌రావు, సమతా సుదర్శన్, దుర్గం శేఖర్, జీవనజ్యోతి రాజభద్రయ్య, అధికార ప్రతినిధి హైమావతి, కపిలేశ్వర్‌రావు, సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు శ్రీహరి తదితర కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# వేములవాడలో భక్తజన సంద్రం

మొదటి పేజీ తరువాయి

ఏర్పాట్లను నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. క్యూలైన్లు, బోనాల సమర్పణ ప్రాంగణాలు, పట్నాలు, నైవేద్యాల సేకరణ కేంద్రాల వద్ద తోపులాటలు జరగకుండా అధికారులు చర్యలు చేపట్టారు. భారీగా తరలివచ్చిన భక్తుల రద్దీకి అనుగుణంగా పటిష్ట బందోబస్తు, పర్యవేక్షణ కొనసాగిస్తున్నారు.




# హైదరాబాద్‌లో IREC 2

మొదటి పేజీ తరువాయి

విధాన రూపకర్తలు, టెక్నాలజీ సంస్థల ప్రతినిధులు ఈ సదస్సులో పాల్గొననున్నారు.
కృత్రిమ మేధ (ఏఐ), ప్రాప్‌టెక్, సుస్థిర అభివృద్ధి, అంతర్జాతీయ పెట్టుబడులు, భవిష్యత్ నగరాలపై సదస్సులో చర్చలు జరగనున్నాయి. భారతీయ రియల్ ఎస్టేట్ ప్రాజెక్టులను అంతర్జాతీయ మార్కెట్లు, పెట్టుబడిదారులతో అనుసంధానించడమే ప్రధాన లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు. అంతర్జాతీయ రియల్ ఎస్టేట్ సదస్సుతో పాటు ప్రాప్‌టెక్ ఇన్నోవేషన్ షోకేస్, లగ్జరీ ప్రాపర్టీ ఎక్స్‌పోను కూడా నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమం ద్వారా భారత రియల్ ఎస్టేట్ రంగానికి అంతర్జాతీయ స్థాయిలో మరింత గుర్తింపు, పెట్టుబడుల అవకాశాలు లభించే అవకాశం ఉందని నిర్వాహకులు పేర్కొన్నారు.

# కోటిన్నర విలువైన హాషిష్ ఆయిల్ స్వాధీనం

## 12 కిలోల డ్రగ్ పట్టివేత

## ముగ్గురు పెడ్లర్ల అరెస్ట్ .. ఇద్దరు సప్లయర్లు పరారీ

దశ, హైదరాబాద్: కుషాయిగూడలో భారీగా హాషిష్ ఆయిల్ రవాణా చేస్తున్న ముఠాను మల్కాజ్‌గిరి పోలీసులు పట్టుకున్నారు. రూ.1.5 కోట్ల విలువైన 12 కిలోల హాషిష్ ఆయిల్‌ను స్వాధీనం చేసుకుని ముగ్గురు పెడ్లర్లను అరెస్టు చేసినట్లు మల్కాజ్‌గిరి పోలీస్ కమిషనర్ సుమతి తెలిపారు. మరో ఇద్దరు సప్లయర్లు పరారీలో ఉన్నారని, వారిలో విజయ్ కీలక వ్యక్తిగా గుర్తించినట్లు వెల్లడించారు. డ్రై గంజాయిని రవాణా చేయడం కష్టంగా మారడంతో నిందితులు హాషిష్ ఆయిల్‌ను ఎంచుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ ముఠా హైదరాబాద్‌తో పాటు మరో మూడు నగరాలకు డ్రగ్‌ను సరఫరా చేస్తున్నట్లు గుర్తించామని, వ్యవస్థీకృతంగా రవాణా చేస్తున్నట్లు వెల్లడించారు. పరారీలో ఉన్న విజయ్‌ను అరెస్టు చేస్తే మొత్తం నెట్‌వర్క్ వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని పోలీసులు తెలిపారు.
ఒక్క గ్రాము హాషిష్ ఆయిల్‌ను రూ.2 వేల నుంచి రూ.3 వేల వరకు విక్రయిస్తున్నట్లు విచారణలో తేలిందని అధికారులు తెలిపారు. ఒక్కసారి తీసుకున్న తర్వాత దాని మత్తు ప్రభావం వారం రోజుల వరకు ఉంటుందని పేర్కొన్నారు. హాషిష్ ఆయిల్ రవాణాను ఈ ఏడాది ఇప్పటివరకు నాలుగుసార్లు పోలీసులు ఛేదించినట్లు సీపీ సుమతి తెలిపారు. ఈ ఏడాది ఇప్పటివరకు హాషిష్ ఆయిల్‌కు సంబంధించి 77 కేసులు నమోదు చేసి 107 మందిని అరెస్టు చేసినట్లు వెల్లడించారు. సుమారు రూ.5 కోట్ల విలువైన హాషిష్ ఆయిల్‌ను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. పరారీలో ఉన్న సప్లయర్ల కోసం ప్రత్యేక బృందాలతో గాలింపు కొనసాగుతున్నట్లు పోలీసులు పేర్కొన్నారు

# శుభకార్యాల ఇళ్ల వద్ద బలవంతపు వసూళ్లపై పోలీసుల కొరడా

మొదటి పేజీ తరువాయి

ఇవ్వలేమని కుటుంబ సభ్యులు వేడుకున్నప్పటికీ వారు వినకుండా అసభ్యకరంగా ప్రవర్తించి, తీవ్ర పదజాలంతో దూషించినట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ ఘటనకు సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో పోలీస్ శాఖ దృష్టికి వెళ్లింది. ఘటనపై స్పందించిన డీజీపీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా గతంలో హైదరాబాద్ సీపీగా ఉన్న సమయంలో చేపట్టిన ప్రత్యేక చర్యలను రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయాలని డీజీపీ అధికారులను ఆదేశించినట్లు సమాచారం. హైదరాబాద్‌తో పాటు అన్ని జిల్లాల్లోని కమిషనరేట్లు, ఎస్పీ పరిధుల్లో నిఘాను పెంచి, బలవంతపు వసూళ్లు, బెదిరింపులకు పాల్పడే వ్యక్తులపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. అయితే పోలీసుల చర్యలు మొత్తం ట్రాన్స్‌జెండర్ సమాజానికి వ్యతిరేకం కాదని డీజీపీ స్పష్టం చేసినట్లు తెలుస్తోంది. అక్రమ వసూళ్లు, బెదిరింపులకు పాల్పడే నేరపూరిత వ్యక్తులపైనే చర్యలు ఉంటాయని పేర్కొన్నారు. ప్రభుత్వం ఇప్పటికే ట్రాన్స్‌జెండర్ల జీవనోపాధి కోసం పలు సంక్షేమ, ఉపాధి కార్యక్రమాలు అమలు చేస్తోందని గుర్తుచేశారు. పలువురు




ట్రాన్స్‌జెండర్లు ట్రాఫిక్ అసిస్టెంట్లుగా, ఇతర ప్రభుత్వ విభాగాల్లో ఉద్యోగాలు చేస్తూ గౌరవప్రదంగా జీవిస్తున్నారని తెలిపారు. ఉపాధి అవకాశాలను వినియోగించుకుంటూ సమాజంలో గౌరవంగా జీవించే వారిని, దందాలు, బెదిరింపులకు పాల్పడే వ్యక్తులను వేర్వేరుగా చూస్తామని పోలీస్ యంత్రాంగం స్పష్టం చేసింది. శుభకార్యాలు చేసుకునే సామాన్య ప్రజలను అడ్డుకోవడం, బెదిరించడం, బలవంతంగా డబ్బులు వసూలు చేయడం వంటి చర్యలకు పాల్పడితే చట్టపరమైన పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించింది.

# రేవంత్.. కొడంగల్‌లో రాజీనామా చేయండి..

మొదటి పేజీ తరువాయి

రేవంత్‌రెడ్డి విజయం సాధించినా తాను ముక్కు నేలకు రాసి క్షమాపణలు చెబుతానన్నారు. ఆ ధైర్యం లేకపోతే పార్టీ మారిన ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించి ఉప ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. తన 20 ఏళ్ల రాజకీయ జీవితంలో ఇలాంటి భాష ఎప్పుడూ వినలేదని సీఎం రేవంత్‌రెడ్డి చెబుతున్నారని, అయితే ఆయన గతంలో మాట్లాడిన భాష, ఉపయోగించిన పదజాలాన్ని తెలంగాణ సమాజం మొత్తం చూసిందని కౌశిక్‌రెడ్డి విమర్శించారు. ముఖ్యమంత్రి అసెంబ్లీ సాక్షిగా శాసనసభ్యులను అవమానించేలా మాట్లాడారని ఆరోపించారు. మహిళా జర్నలిస్టుల విషయంలోనూ సీఎం అభ్యంతరకరంగా మాట్లాడారని అన్నారు. తనపై ఎథిక్స్ కమిటీ ద్వారా చర్యలు తీసుకుంటామని చెబుతున్నారని, బీఆర్ఎస్ బీఫామ్‌పై గెలిచి పార్టీ మారిన నేతలు తమపై ఆరోపణలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. కడియం శ్రీహరి డిప్యూటీ సీఎం, ఎమ్మెల్సీ, ఎంపీగా ఉన్నప్పుడు ఎథిక్స్ గుర్తుకు రాలేదా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో ఇది ప్రభుత్వం కాదని, సర్కస్ అని పలుమార్లు రుజువైందని విమర్శించారు. అసెంబ్లీకి రాకుండా తమను అడ్డుకున్నారని, మహిళా ఎమ్మెల్యేలను పురుష పోలీసులు, పురుష ఎమ్మెల్యేలను మహిళా పోలీసులు అడ్డుకున్నారని ఆరోపించారు. పురుష ఎమ్మెల్యేలపై మహిళా పోలీసులతో దాడి చేయించారని, మహిళా ఎమ్మెల్యేల పట్ల కూడా పోలీసులు అసభ్యంగా ప్రవర్తించారని కౌశిక్‌రెడ్డి ఆరోపించారు. మహిళా పోలీస్ అధికారి శిల్పవల్లి వ్యవహరించిన తీరు బాధాకరమని పేర్కొంటూ.. "నువ్వు చదువుకున్న అధికారివి.. ఇదేనా సంస్కారం?" అని ప్రశ్నించారు. మహిళా ఎమ్మెల్యేల జుట్టు, చీర లాగి అవమానకరంగా ప్రవర్తించారని ఆరోపిస్తూ, ఇది సరైన పద్ధతి కాదని అన్నారు.

# నన్ను పర్సనల్‌గా కలిస్తే.. మార్కులిస్తా!

## జేఎన్‌యూ ప్రొఫెసర్ వాట్సాప్ చాట్ కలకలం

## 11 మంది విద్యార్థినుల ఫిర్యాదులు

## వైవాలో అనుచిత వ్యాఖ్యలు, అదనపు మార్కుల ఆశ చూపినట్లు ఆరోపణలు

**దశ, న్యూఢిల్లీ :** దేశంలోని ప్రముఖ విద్యాసంస్థల్లో ఒకటైన జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ (జేఎన్‌యూ)లో లైంగిక వేధింపుల ఆరోపణలు కలకలం రేపుతున్నాయి. ఓ ప్రొఫెసర్ తమ పట్ల అసభ్యకరంగా ప్రవర్తించారని, వ్యక్తిగతంగా కలిస్తే పరీక్షల్లో అదనపు మార్కులు వేస్తానని ఆశ చూపినట్లు ఆరోపిస్తూ ఏకంగా 11 మంది విద్యార్థినులు విశ్వవిద్యాలయ అంతర్గత ఫిర్యాదుల కమిటీ (ఐసీసీ)ని ఆశ్రయించినట్లు సమాచారం. ఫిర్యాదులపై ఐసీసీ విచారణ కొనసాగిస్తోంది. మే మొదటి వారంలో జరిగిన వైవా పరీక్షల అనంతరం విద్యార్థులు మాత్రమే ఉన్న వాట్సాప్ గ్రూప్‌లో ఓ విద్యార్థిని తనకు ఎదురైన అనుభవాన్ని పంచుకోవడంతో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చినట్లు తెలుస్తోంది. వైవా సమయంలో సదరు ప్రొఫెసర్ లైంగిక భావన కలిగించే వ్యాఖ్యలు చేశారని, తనతో వ్యక్తిగతంగా గడిపితే అదనపు మార్కులు ఇస్తానని చెప్పినట్లు ఆమె ఆరోపించింది. ఈ విషయం తెలుసుకున్న మరికొందరు విద్యార్థినులు కూడా ముందుకు వచ్చి, తమకు సైతం అదే ప్రొఫెసర్ నుంచి అనుచిత ప్రవర్తన ఎదురైందని వెల్లడించినట్లు సమాచారం. కేవలం వైవా పరీక్షలకే పరిమితం కాకుండా.. క్యాంపస్‌లోని తన అధికారిక నివాసంలో నిర్వహించే సమావేశాలకు విద్యార్థినులను ఆహ్వానించి అక్కడ కూడా అనుచితంగా ప్రవర్తించేవారని కొందరు ఫిర్యాదుల్లో పేర్కొన్నట్లు తెలుస్తోంది. తరగతి గదుల్లో బోధన సమయంలోనూ అసభ్యకరమైన వ్యాఖ్యలు చేసేవారని విద్యార్థినులు ఆరోపించినట్లు సమాచారం. మేలో ఫిర్యాదులు నమోదైన కొద్దికాలానికే జేఎన్‌యూకు సుమారు 45 రోజుల సెమిస్టర్ విరామం రావడంతో వ్యవహారం కొంతకాలం మరుగునపడింది. జూలైలో తరగతులు పునఃప్రారంభమైన తర్వాత ఈ అంశం క్యాంపస్‌లో మళ్లీ చర్చనీయాంశంగా మారింది. సీనియర్ విద్యార్థినులు సహా మరికొందరు ముందుకు వచ్చి ఫిర్యాదులు చేసినట్లు తెలుస్తోంది. ఫిర్యాదుల తీవ్రత నేపథ్యంలో విద్యార్థినుల నుంచి వాంగ్మూలాలను నమోదు చేసేందుకు ఐసీసీ చర్యలు చేపట్టింది. ఫిర్యాదు చేసిన విద్యార్థినులు స్వయంగా కమిటీ ఎదుట హాజరై తమకు ఎదురైన అనుభవాలను వివరించాలని సూచించినట్లు సమాచారం.

Printed, Published and Owned by B.KALPANA and Printed at Kalpana Publications , Flat No.101,Sri Heights Apartment,Shilpi Colony,Pasumamula Road,Pedda Amberpet,Rangareddy,Telangana-501505, and Published at Flat No.101,Sri Heights Apartment,Shilpi Colony,Pasumamula Road,Pedda Amberpet,Rangareddy,Telangana-501505. Editor: B.KALPANA. PRGI.No.TGTEL/25/A4195. Cell 9848288850, namasteshekar@gmail.com